క్లుప్తంగా

కందకాలను శుభ్రం చేయాలి



అలంపూర్: కందకాలను శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ శంకర్‌కు పట్టణ వాసులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆలయాల సమీపంలోని కందకాల్లో వర్షపు నీరు నిలిచినట్లు వినతిలో తెలిపారు. రోజుల తరబడి కందకాల్లో నీరు నిల్వడంతో మురికిగా మారి దుర్వాసన వస్తున్నట్లు పేర్కొన్నారు. దోమలకు ఆవాసాలుగా మారి రోగాలు ప్రబలుతున్నట్లు వాపోయారు. గతంలో అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

శాఖాపరమైన చర్య తీసుకోండి

మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్‌పై శాఖాపరమైన చర్య తీసుకోవాలని మంగళవారం తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మకు ఎమ్మార్పీఎస్ తాలుకా ఇన్‌చార్జ్ జయరాజ్ కోరారు. అంగన్‌వాడీ–2 కేంద్రం టీచర్ తుల సమ్మ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, విధులకు హాజరు కాకున్నా హాజరైనట్లు రికార్డులు తారుమారు చేస్తుందని ఆరోపించారు. తగిన ఆధారాలు ఉన్నాయని వెంటనే చర్య తీసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న సందెరాళ్ల పోటీలు



మల్దకల్: వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలో సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. పోటీలకు వివిధ గ్రామాలకు చెందిన 20 మందికి పైగా పోటీదారులు పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన మల్దకల్ 110 కేజీల చేతిరాయిని ఎత్తి విజేతగా నిలిచాడు. విజేతకు రూ.10వేల నగదు బహుమతిని వాల్మీకి సోదరులు అందజేశారు. కార్యక్రమంలో వెంకటన్న, పరుశరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

ఉండవెల్లి: మండలంలో జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు మంగళవారం ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. కర్నూలు నుంచి తరలిస్తుండగా బ్లూ కోర్టు పోలీసులు పట్టుకొని నంద్యాలకు చెందిన డ్రైవర్ గజ్జెల మద్దిలేటి, యజమాని రాజోళి విక్రమసింహారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామంలోని దసరా సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు మంగళవారం ఎమ్మెల్యే విజయుడు బహుమతులు ప్రదానం చేశారు. కర్నూలు జిల్లా కల్లూరు రవి టీంకు రూ.20 వేలు, రెండో బహుమతిని పుల్లూరు దిలీప్ టీంకు రూ.10 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీంకు ఘన నివాళి

గట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఆదివాసీ కొమురం భీం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రాజు మాట్లాడుతూ.. తెలంగాణ విముక్తి కోసం అసఫ్ జాహీలకు వ్యతిరేకంగా పోరాడిన గోండు గిరిజన ఉద్యమ నాయకుడు భీం అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుక్క కాటుపై నిర్లక్ష్యం వద్దు

అయిజ: వీధి కుక్కలు పశువులను కరిచినప్పుడు తప్పకుండా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని, నాటు వైద్యంపై ఆధారపడవద్దని, ఏ పశువులో అయినా రేబిస్ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వాటిని మిగతా వాటికి దూరంగా ఉంచాలని ఇంచార్జ్ వెటర్నరీ డాక్టర్ మల్లేష్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామంలో ఓ ఆవుకు రేబిస్ వ్యాధి లక్షణాలు ఉన్నాయని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేయడంతో వెటర్నరీ డాక్టర్ తుపత్రాలకు చేరుకొని ఆవుని పరిశీలించారు. ఆవు నుంచి శాంపిల్స్ సేకరించి మహబూబ్‌నగర్‌లోని ల్యాబ్‌కు పంపారు. ఏ పశువు అయినా కుక్కకాటుకు గురైతే వెంటనే ఏడు డోసులు టీకాలు వేయించాలని, అప్పుడే దానిని రేబిస్ వ్యాధి సోకకుండా కాపాడవచ్చని సూచించారు.

పత్తి రైతుకు పెద్ద కష్టం

- పత్తి చేతికొస్తున్నా ప్రారంభం కాని సీసీఐ కేంద్రాలు
- ఇదే అదునుగా దండుకుంటున్న దళారులు, వ్యాపారులు
- క్వింటాకు రూ.3 వేల వరకు నష్టం
- వర్షాలతో నాణ్యత లేక నష్టాలు



దళారులు కొనుగోలు చేసి తరలిస్తున్న పత్తి



ఉండవెల్లిలో పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

ఉండవెల్లి: ప్రకృతి వైపరీత్యాలు, కొనుగోళ్లలో ఒడిదుడుకులు పత్తి రైతును కుంగదీస్తున్నాయి. పంట చేతికొస్తున్నా సీసీఐ కేంద్రాలను ప్రారంభించడం లేదు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు తీర్చేందుకు, ఇతర అవసరాలకు తక్కువ ధరకే పత్తిని అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు, వ్యాపారులు, తేమ, నాణ్యత లేదని, రంగు మారిందని సాకులు చూపి ధర తగ్గించి రైతును దోచుకుంటున్నారు. మరోవైపు ఇటీవల కురిసిన వర్షాలతో నాణ్యత, దిగుబడి తగ్గి పంట నష్టపోతున్నట్లు వాపోయారు.

11 వేల ఎకరాల్లో సాగు..

మండలంలో 11 వేల ఎకరాలకు పైగా పత్తిసాగు చేస్తున్నారు. సుమారు 22 వేల క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలో లేదో తెలియక రైతులు సతమతమవుతున్నారు.

దక్కని మద్దతు ధర..

కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాకు రూ.8110 నిర్ణయించింది. కానీ దళారులు, ప్రైవేటు వ్యాపారులు రూ.6 వేలకు మించి ధర చెల్లించడం లేదు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని ఇళ్ల వద్దకు, పొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు, దళారులు మోసాలను అరికట్టాల్సిన మార్కెటింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ తదితర ప్రాంతాల్లో పత్తిని విక్రయిస్తున్నారు.

పంట నష్టం మరోవైపు

మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి వంద ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో ఏఈఓలు, మండల అధికారులు రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా పంట నష్టం రాసి జిల్లా అధికారులకు పంపించారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులకు అనుగుణంగా ఉన్న రైతుల పేర్లను మాత్రమే నష్టపరిహారానికి అనుమతించారని, వాగులు, వర్షానికి నష్టం వచ్చిన వాటికి పరిహారం ఏదని అడగ్గా ఇప్పుడు రావని తప్పించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సీసీఐకు అనుమతించి పత్తికి మద్దతు ధర చెల్లించి విక్రయించాలని రైతులు కోరుతున్నారు.



ఉండవెల్లిలో ఆరబెట్టిన పత్తి పంట

నష్టం వచ్చినా.. విక్రయిస్తున్నాం



నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. తొలి దశ చేతికొచ్చిన పత్తిని వారం రోజుల క్రితం ప్రైవేటు వ్యాపారికి విక్రయించాం. రంగు మారిందని క్వింటాకు రూ.6 వేలు చొప్పున చెల్లించారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం వల్లే ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

– నాగరాజు, ఉండవెల్లి, రైతు

దెబ్బతిన పంటకు ధర చెల్లించాలి

దెబ్బతిన్న పత్తి పంటకు ధరను కేటాయించి రైతులు ఆదుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో కౌలుకు వేసుకున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మద్దిలేటి, కలుగోట్ల

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మావతి

అలంపూర్: స్థానిక సంస్థల బరిలో నిలిచే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని ఎంపీడీఓ పద్మావతి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలపై రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎన్నికల అధికారులు మాట్లాడుతూ.. సభలు, సమావేశాలకు రెవెన్యూ, పోలీస్ శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండలంలో ఎంపీటీసీలకు 32 పోలింగ్ స్టేషన్లు, సర్పంచ్‌లకు 120 పోలింగ్ స్టేషన్లు ఉండనున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జానయ్య, నరసింహ, రాముడు, బీజేపీ నాయకులు రంగస్వామి, వెంకటస్వామి, విశ్వం తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాస్వామ్య దేశంలో చీకటి రోజులు’



ఎర్రవల్లిలో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

ఎర్రవల్లి: ప్రజాస్వామ్య దేశంలో చీకటి రోజులు నడుస్తున్నాయని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్‌పై దాడికి యత్నించడం హేయమైన చర్య అన్నారు. నిందితుడిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలన్నారు. రాజ్యాధికారం దక్కనంత కాలం దళిత జాతులకు అవమానాలు, అణిచివేతలు, దాడులు తప్పవన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్, నాయకులు రాముడు, శాంతిరాజు, శివన్న, బొజ్జన్న, గోపాల్, లక్ష్మన్న, కృష్ణ, పాల్గొన్నారు.

దాడి మతోన్మాద చర్య

రాజోళి: సుప్రీంకోర్టు సీజేఐ గవాయిపై దాడికి యత్నించడం మతోన్మాద చర్య అని ఆర్‌ఎస్పీ టీం మండల అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అశోక్, రాజు, విజయ్, భాస్కర్, శేఖర్ తదిదరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



ఐడీఎస్‌ఎంటీ కాలనీ వాసుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్

గద్వాల క్రైం: రాత్రి సమయాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు మంగళవారం ఉదయం ఐడీఎస్‌ఎంటీ కాలనీలో పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 10 శాతం స్థలంలో గుడిసెలు ఏర్పాటు చేసుకుని కాలనీ ప్రజలకు సమస్యలు తీసుకురావడం మంచిది కాదన్నారు. రాత్రి వేళ్లలో కొందరు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో, కాలనీవాసుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎవరైనా ఇలాంటి పనులు చేసినా, ప్రోత్సహించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. తాత్కాలిక గుడిసెల ముసుగులో చేస్తున్న పనులు, ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడం సరికాదని, తాత్కాలిక గుడిసెలను తొలగించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందన్నారు. వీలైనంత త్వరగా గుడిసెలను తొలగించాలన్నారు. అనంతరం కాలనీ వాసులతో పలు సమస్యలపై ఎస్‌ఐ ఆరా తీశారు.

దాడి కేసులో ముగ్గురి రిమాండ్

గద్వాల క్రైం: అకారణంగా దాడి చేసి కులం పేరుతో దూషించిన కేసులో ముగ్గురు నిందితులను మంగళవారం అలంపూర్ కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మొగిలయ్య తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన మండపం వద్ద చింతలపేట కాలనీకి చెందిన యువకులు మద్యం మత్తులో తాజా మాజీ కౌన్సిలర్ మహేష్, శ్రీనువాసులు, వినయ్‌పై అకారణంగా దాడి చేసి కులం పేరుతో దూషించారు. అనంతరం మండపంలో ప్రతిష్ఠించిన గణనాథుడి చేతిలో లడ్డు(ప్రసాదం) ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు, తీవ్రంగా దాడి చేసిన ఘటనపై మరో కేసు నమోదు చేశామన్నారు. అనంతరం పలువురిని రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితులు వడ్డే నవీన్, వడ్డే నరేష్, కళ్యాణ్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం సాయంత్రం పట్టణంలోని లింగంబావిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చింతలపేట కాలనీకి చెందిన ఆంజనేయులు(48) బావిలో స్నానం చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. స్థానికులు కాపాడేందుకు ప్రయతి్నంచగా చేయగా ఫలితం లేకపోయింది. సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మల్దకల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్

మల్దకల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు పరిశీలించిన అనంతరం వడ్డించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ వెంకటేష్, పరమన్న, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం

మానవపాడు: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిద్ధంగా ఉన్నామని బీజేపీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ గ్రామాల రిజర్వేషన్లకు అనుగుణంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలకు కావాలసిన నాయకులను గుర్తించి, వివరాలను అధిష్టానానికి అందజేస్తామన్నారు. ఎన్నికల్లో ప్రజల మద్దతు పూర్తిగా బీజేపీకే ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, మురళీకృష్ణ, కుర్మన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను పాఠశాలకు పంపించాలి



పొలంలో పనులు చేస్తున్న వారికి అవగాహన కల్పిస్తున్న రాజేందర్

కేటీదొడ్డి: చిన్నారులను పనులకు పంపకుండా తప్పనిసరిగా పాఠశాలకు పంపాలని జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజేందర్ అన్నారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా మండలంలోని నందిన్నె, కేటీదొడ్డి పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాజేందర్ మాట్లాడుతూ.. నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. బడిబయటి ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయుల కొరత ఉందని విద్యార్థులు చెప్పడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం పొలాలో పనిచేస్తున్న నలుగురు చిన్నారులను గుర్తించి సంబంధిత పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో లక్ష్మణస్వామి, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు ప్రకాష్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని విస్మరించిన అధికారులు



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: జిన్నారం, గజ్వేల్, ఇస్నాపూర్ మున్సిపాలిటీల్లో వార్డుల విభజన మొదలైందని, అధికారులు అయిజ మున్సిపాలిటీని మాత్రం విస్మరించారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మున్సిపాలిటీలో 20 వార్డులను 30 వార్డులుగా పెంచాలని అనేకసార్లు ఉన్నత అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపాలిటీలో ప్రతి కాలనీలో స్థిరమైన అభివృద్ధి జరగాలంటే వార్డుల సంఖ్య 30కు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు నాగరాజు, ఖుషి, నరసింహ, రఘు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

గట్టు: బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల గ్రామీణ వికాస బ్యాంక్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని యల్లందొడ్డి గ్రామంలో మంగళవారం బ్యాంకు సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ– గవర్నెన్స్, డిజిటల్ లావాదేవీలపై వివరించారు. ఆర్థిక భద్రత కోసం ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పెన్షన్, బీమా పథకాలను తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, పీవై, ఎస్‌ఎస్‌వై వంటి పథకాల ప్రాముఖ్యత తెలియజేశారు. డిజిటల్ యుగంలో ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసపూరిత ప్రకటనలు నమ్మి, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దన్నారు. అపరిచితులకు బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత వివరాలు తెలియజేయవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే తక్షణమే 1930కు తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనూష, ప్రకాష్, వీరేష్, చాంద్ బాష తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు ఆదర్శం వాల్మీకి



నందిన్నెలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



పుల్లూరులో వాల్మీకి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

సాక్షి నెట్‌వర్క్: వాల్మీకి మహర్షి భావితరాలకు ఆదర్శనీయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మంగళవారం కేటీదొడ్డి మండలంలోని కుచినెర్ల, నందిన్నె, మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నల్లా హనుమంతు, నాయకులు ఉరుకుందు, టీచర్ గోవిందు, చంద్రశేఖర్, కొండన్న, తదితరులు పాల్గొన్నారు.

- మనిషి మహనీయుడిగా ఎలా మారవచ్చనే దానికి వాల్మీకి మహర్షి జీవితమే సాక్ష్యమని తహసీల్దార్ రామ్మోహన్ అన్నారు. రాజోళిలో వాల్మీకి నాయకులతో కలిసి వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వాల్మీకి మండల అధ్యక్షుడు దాసన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.
- అయిజ మండల కేంద్రం, వివిధ గ్రామాల్లో వాల్మీకి సంఘాల ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
- గట్టు మండలంలోని రాయాపురంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి, పూజలు చేశారు. అదే విధంగా ఆలూరు గ్రామంలో బీజేపీ జిల్లా నాయకురాలు స్నిగ్ధారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు వాల్మీకి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, బీజేపీ మండల అధ్యక్షుడు నాగరాజు, వాల్మీకి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- మల్దకల్ తహసీల్దార్ రూన్సీరాణి, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్ వారి కార్యాలయాల్లో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు వెంకటన్న, రాముడు, నర్సింహులు, మల్దకల్, పరుశరాముడు, గోపాల్, తిమ్మప్ప, రంగన్న తదితరులు పాల్గొన్నారు.
- అలంపూర్ పట్టణంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం నాయకులు స్థానిక వాల్మీకి మహర్షి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.
- శాంతినగర్ మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, వాల్మీకి సంఘం నాయకులు జగన్, కృష్ణయ్య, రామానాయుడు, పైపాడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- ఇటిక్యాల మండల కేంద్రంతో పాటుగా సాతర్ల, షాబాద్, చాగాపురం, ఉదండాపురం తదితర గ్రామాల్లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘణంగా నిర్వహించారు.
- మానవపాడు తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహర్షి జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో అధికారులు, వాల్మీకి నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- ధరూరు మండల పరిధిలోని ఉప్పేరు, మన్నాపురం గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకల్లో బీజేపీ జిల్లా నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి పాల్గొన్నారు. వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకటరాములు, జిల్లా కోశాధికారి మీర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు,
- ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురం, కోదండాపురం, కొండేరు గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహర్షి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ నాయుడు, ఈరన్న, సీతారాముడు, లక్ష్మన్న, సాయిబాబా, తిమ్మన్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.
- ఉండవెల్లి మండలంలోని పుల్లూరులో వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే విజయుడు పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామాయణ రచయిత, సర్వ ప్రజానీకానికి మార్గదర్శకుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. కార్యక్రమంలో కలుగోట్ల పీఏసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్‌లో పూజలు చేస్తున్న గ్రామస్తులు